# మధ్య తరం మనిషి

కల్యాణీసోమరాజ్

**(గత సంచిక తరువాయి)**

ఆ విషయం తెలిసి శాంత చాలా సంతోషించింది. అత్తగారి అధికారాలు, మామగారి మందలింపులు, ఆడబడుచుల వేళాకోళాలు, తోడికోడళ్ల వేధింపులు లేని సొంత జీవితం. భర్తతో గడపబోయే, ఏకాంతమధురప్రణయాన్ని తలచుకుంటూ కొన్నాళ్లు మురిసిపోయింది.

"నీకు ట్రాన్స్‌ఫర్ అయిందిట కదా..."

"ఔను నాన్నా!" తల ఊపాడు భక్తిగా కొడుకు.

"ఏం దిగులు పడక. నేను ఆ కమిటీ మెంబర్‌తో చెప్పి ఆపు చేయిస్తాను" అన్నాడు.

"పోని ఈ ఏడాదికి వెళ్తాను" అంటూ మనసులో ధృఢంగా రావాలనుకున్న మాట, గొంతు ఒంపుల్లో పల్చబడి పెదిమల చివర నుంచి, సన్నగా జారింది.

అంతే! తండ్రి మొహం అప్పటికప్పుడు కోపంతో కందిపోయింది. "ఏమిటీ.. వేరే కాపురం పెట్టాలని ట్రాన్స్‌ఫర్ నువ్వే చేయించుకున్నావా...?"

ఆశించని నింద. "అబ్బే. అదేం లేదు... ఒక్క ఏడాది ఉండి మళ్లీ ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చు" అని సణిగాడు పరశురామయ్య.

"ఇదంతా వీడికి పుట్టిన బుద్ధి కాదు. కోడలు నేర్పించి ఉంటుంది." అక్కడే ఉన్న తల్లి, కొడుకు గౌరవం కాపాడుకుందామనో, కోడలి మీద చులకనతోనో అనేసింది విసురుగా.

ట్రాన్స్‌ఫర్ ఆగిపోయింది.


శాంత మీద సాధింపులు తగ్గాయి.

కాని తన కోరిక తీరనందుకు శాంత మాత్రం గుట్టుగా ఏడ్చింది.

మళ్లీ ఇన్నాళ్లకు భార్య నోటి వెంట ఆ కోరిక గళం విప్పటంతో, పరశురామయ్య ఆలోచనగా చూశాడు, భార్యవంక.

ఇంటికి బాగోగుల పని పూర్తి అయ్యాక, తెలిసినవాళ్లకి తాళాలిచ్చి అద్దెకి ఎవరైనా వస్తే తెలియపరచమని తిరిగి వచ్చేశారు.

"ఇంటికి బేరం పెట్టక అద్దె అంటూ ఎందుకమ్మా అనవసరమైన గొడవ? మనం ఇక్కడుంటూ ఎక్కడో అద్దె ఇంటిని మెయిన్‌టెయిన్ చేయటం కష్టం." కొడుకూ, కూతురూ కూడబలుక్కున్నట్లు ఒకటే మాట అన్నారు.



"అయితే ఇప్పుడు ఏం చేయమంటారు?" పిల్లల మనసు తెలుసుకుందామని అన్నాడు పరశురామయ్య.

"అమ్మేస్తే పోతుంది!" ఒక్కసారి ఇద్దరి నుంచీ ఒకే మాట.

"తల్లి ఆస్తిలో ఆడపిల్లలకే హక్కు ఉంటుంది కదూ నాన్నా?" ఉష గారంగా అంది.

"అమ్మకి నువ్వు, నేను ఒకటే. ఏం చేసినా సమంగానే చేస్తుంది" అంటూ కొడుకు.

మొత్తానికి ఎందుకు నాకీ వయసులో ఈ ఆస్తి కొత్త సమస్యలు ఉరి పోసుకోటానికి తప్పించి-అని శాంత మనసులో మథనపడేలా చేసింది ఆ ఇల్లు.

ఆదివారం అనుకున్నట్లుగానే అందరూ హాల్లో సమావేశమయ్యారు. పైకి ఎవ్వరూ ఏమీ పట్టించుకోకుండా లోకాభిరామాయణం మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నా, అందరికీ లోలోపల, పరశురామయ్య ఇంటి గురించి ఏమి చెబుతాడో అన్న ఆత్రుతవుండనే ఉంది.

శాంత మాత్రం ఏమీ పట్టనట్లు పూలు కడుతూ దూరంగా కూర్చుంది.

"మీకో విషయం చెప్పాలనుకుంటున్నానర్రా!"

అందరూ నిశ్శబ్దంగా ఏమిటన్నట్లు పరశురామయ్య వంక చూశారు.

"రెండు రోజుల్లో నార్త్ ఇండియా తిప్పి చూపించేందుకు యాత్రా స్పెషల్ బస్ ఒకటి బయల్దేరుతోంది. దాంట్లో నాకూ, మీ అమ్మకూ, రెండు టిక్కెట్లు బుక్ చేశాను. అక్కడ నుంచి వచ్చాక, మేమిద్దరం ఆ పల్లెటూళ్లో మీ అమ్మకి వచ్చిన ఆ ఇంట్లో కొన్నాళ్లు ఉందామనుకుంటున్నాం."

"ఈ వయసులో ఏ వసతీ లేని ఆ పల్లెటూళ్లో వుంటారా? మీకు ఇల్లు అమ్మటం ఇష్టం లేకపోతే అమ్మకండి. అంతే గాని, మిమ్మల్ని ఇక్కడ నుంచి ఎవరు వెళ్లిపొమ్మన్నారు?" చికాగ్గా అన్నాడు కొడుకు.

కూతురూ విసుగ్గానే చూసింది.

"నిజమే. ఈ శిశిరంలో అడుగు పెట్టాక, జీవితపు చివరి అధ్యాయంలో మాకేమిటి ఈ కోరిక అని మీరు అనుకుంటే, మేము మీకు అర్థం అయ్యేలా చెప్పలేము. జీవితంలో తొలినాటి ముచ్చట్ల తొలకరి చినుకులు తొంగి చూడకుండానే చివరి పేజీకి వచ్చేశాం. ఏం చేయం? మాది ఒక తెలివితక్కువ తరం. అటు పెద్దవాళ్ల మీద గౌరవంతోనూ, ఇటు పిల్లల మీద మేము పెంచుకున్న ప్రేమతోనూ నలిగిపోయాం. నా కంటే కూడా ఎక్కువగా బాధ పడింది మీ అమ్మ. అప్పుడు ఆమెను పట్టించుకోలేదు. భార్యను ప్రేమగా చూసుకుంటే తల్లిదండ్రులకి ద్రోహం చేసినట్లు అవుతుందేమో అనుకునే పిచ్చివాడిని. ఇప్పుడు ఆమెను నేను పట్టించుకోకపోతే మానవత్వం ఎరుగని మనిషిని అవుతాను. ఈ చివరి రోజుల్లో మా గురించి మేము ఆలోచించుకోవాలని ఉంది. మాకు మేమే బ్రతకాలనుకుంటున్నాం."

ఆ హాల్లో వున్న ఎవ్వరికీ పరశురామయ్య ఆవేదన ఏమిటో అర్థం కాలేదు, ఒక్క శాంతకు తప్పించి!!

# అమ్మాజీ

నల్లల వెంకటేశ్వరరావు

(అమ్మాజీ పరిచయం కలగకపోతే జీవితాంతం నేను సవరాలు కడుతూనే ఉండేవాడినేమో? నా జీవితంలో అమ్మాజీ ప్రవేశం గొప్ప మార్పు తీసుకొచ్చింది. నాకంటూ ఒక వ్యక్తిత్వం, ఒక స్టేజీ కలిసొచ్చాయి. 30 ఏళ్ల క్రితం ముచ్చట)

"సవరాలు కడతామండీ... సవరాలు...
కుప్పులు... జడ గంటలు...
ఒంటి సవరాలూ... హాయ్" అని తిరగడం నా వృత్తి! సవరాలు కట్టించుకునేది ఆడవాళ్లే కనుక ఎక్కువగా ఆడవాళ్లతోనే పరిచయాలు, బేరాలు, సారాలు.

నేను మగవాడినని ఆడవాళ్లు జంకరు. ఎంత మగవాడినైనా సాధారణంగా మా వృత్తి మమ్మల్ని మగాళ్లుగా నిలవనియ్యదు. మేమంటే 'ఓ లోకువ.' "సవరాలు కట్టేవాడూ ఓ మగాడే?" అన్నట్లు చూస్తారు.

ఇది మా వృత్తి తెచ్చిన చిక్కే తప్ప, మరేమీ కాదనటానికి చాలా ఉదాహరణలున్నాయి. ఎప్పుడన్నా కులాసాగా ఉండి టాక్ టీక్ మంటూ సినిమాకి వెళ్తే అక్కడ కాసేపు, ఇక్కడ కాసేపు కటింగ్‌లు కొడుతూ నుంచున్న నన్ను, విలన్‌ని చూసినట్లు చూసే ఆడవాళ్లని చూసి, ధైర్యాన్ని కూడగట్టుకునేవాడిని. నాకు చాలా గర్వంగా కూడా ఉండేది.

ఇలాంటప్పుడు నా మనసులో ఈ వృత్తిని వదిలేసి మరేదైనా వ్యాపారం చేద్దామా అనే వూగులాట కలిగేది. అందుకు ఎంత డబ్బు కావాలి? ఇదంటే పెట్టుబడి లేని వ్యాపారం. ఇంకోటైతే కనీసం రెండు వేలైనా కావాలి గదా! రెండు వేలు నాబోటి గాడికి రెండు లక్షలు! ఎక్కడ తెచ్చేది?

ఉసూరనిపించేది. ఇన్ని మేడలు, ఇన్ని ఫ్యాక్టరీలు, ఇన్ని కార్లు ఉన్న ఇంత దేశంలో, నాకు రెండు వేలు దానం చేసే మనిషి లేక పోవడం చిత్రంగా ఉండేది.

చాటుగా లక్షలకి లక్షలు డిబ్బీల్లో వేసేవారు నాబోటి వాళ్లకి రెండు వేలిచ్చి, "పో, పోయి వ్యాపారం చేసుకుని మిడుకు" అని అంటే వాళ్లకి పుణ్యమే గదా? నోరూ వాయీ లేని దేవుడికి అంత డబ్బు ఇవ్వొచ్చు గాని, నోరూ, వాక్కూ, ఆకలిదప్పికలున్న సాటి మనిషికి రెండు వేలు ఇవ్వకపోవడం నాకు మా చెడ్డ ఇదిగా ఉండేది.

లోకమంతా ఈ తీరుగానే నడుస్తోంది.

సినిమా హాల్స్ దగ్గర పెద్ద పెద్ద అద్దాలు పెట్టడం న్యాయంగా ఉంటాది నాకు. నాలాంటి లేనోళ్లకి కింది నించి మీదకి చూసుకోవాలంటే ఇంత పెద్ద అద్దాలు మా గుడిసెల్లో ఉండవు గదా? అంచేత సినిమాకి వచ్చినప్పుడల్లా అలాంటి పొడగాటి అద్దాల కాడికి పోయి, నన్ను నేను అద్దంలో చూసుకుని బిర్రబిగుసుకుపోతా వుండే వాడిని.

ఆ మాటకొస్తే నా అందం నన్ను చాలా తబ్బిబ్బు చేస్తుంది. అసలు నాలాంటివాడు సవరాలు కట్టకూడదని తెగ ఇదై పోతాను. నాకంటే పీచుమొహమోళ్లు కార్ల మీద, స్కూటర్ల మీద, బస్సుల మీద, సైకిళ్ల మీద తిరుగుతూ ఏవేవో ఖరీదైన పనులు చేస్తుంటే, నేను కనీసం సైకిలైనా ఎక్కి తిరగడం న్యాయమని ఏడ్చేవాడిని.

పోలిగాడి కూతురు ఇదే మాట ఢంకా మీద దెబ్బేసి చెబుతుంది. "నీకేంట్రా, నీ అమ్మా, బాబూ, సత్తా ఈ ఘనకార్యం అప్పెజెప్పేరు గాని, లేకుంటే నువ్వు సినిమా హీరోవి అయివుందువురా బాయా!" అని వొగలొగలుగా చెబుతుంటే, నిజమే సుమా అనిపించేది.

నాయన చచ్చిపోయి, అమ్మ భూమ్మీద వున్నా నేనీపాటికి డిగ్రీ చదువు పూర్తి చేసి ఉందును. అమ్మ కూడా సవరాలు కడుతూ, నన్ను ఏడో తరగతి వరకు చదివించింది. "మీ అయ్య బుక్కా సామాన్లమ్ముతూ, నేను సవరాలు కడుతూ ఈ భూమ్మీద వుండాలే గాని, నిన్ను చదివిత్తాన్రా అయ్యా..." అనేది అమ్మ.

నాయన ఉన్నంత కాలం బాగానే జరిగింది. ఆయన పాము కరిచి సచ్చిపోయాక, అమ్మ మరీ డీలాపడిపోయి మంచం ఎక్కింది.

"నా ఆశ తీర లేదురా అయ్యా!" అని ఏడ్చేది.

"చదువు లేకపోతే బతకలేమా? నువ్వు బాగా వుండే అమ్మా!" అని తను మంచం దగ్గర కూర్చుని ఏడ్చేవాడు.

ఒక రోజున జోరున వర్షం కురుస్తుంటే దగ్గరకి పిల్చి కూర్చో పెట్టుకుని, "ఒరే, అయ్యా! రుణాలు తీరిపోయాయిరా! నేను పోతున్నాను. పోయే ముందు ఓ నిజం చెప్పి పోతాన్రా అయ్యా..." అని కొంచెం ఆగి మళ్లీ "పిల్లల్లేని మేం ఎవరో కనిపారేస్తే తీసుకొచ్చి పెంచుకున్నాం. నిన్ను మేం కన్లేదురా! మా ఇళ్లల్లో ఉండాల్సినోడివి కాదురా అయ్యా! నిన్ను నడి సముద్రంలో వదిలి పోతున్నాను. ఎలా ఒడ్డుకు చేరతావో..." అని ఊపిరొదిలింది.

***

ఒకసారి పల్లెటూరిలో సవరాలు కడుతూ ఉండగా అమ్మాజీ పరిచయం కలిగింది.

నేను ఎక్కడ సవరాలు కట్టినా, గుంపుగా నలుగురైదుగురు ఆడవాళ్లు నా చుట్టూ చేరి; 'నేనేమన్నా మోసం చేస్తానేమోనని ఓ కంట కనిపెడుతూ' పిచ్చాపాటీ చెప్పుకుంటూ ఉంటారు. కొందరు ముదిసానులు నా వివరాలు అడిగి "నన్ను పెళ్లి చేసుకోరాదూ, కమ్మగా వండి పెడతాను" అని ఎకసెకం ఆడుతూ నవ్విస్తూ ఉంటారు. అదంతా మామూలే!

అలాంటి సమయంలో అమ్మాజీ అనే అమ్మాయి ఒకటికి రెండుసార్లు, ఓరగా నన్ను చూడటం గమనించి వూరుకున్నాను. అమ్మాజీ వయస్సు 25-26 వుండొచ్చు. పెళ్లయి మొగుడు పోయాడని ఆమెని చూడగానే తెల్సిపోతుంది.

కాని, ఆమెని ఓ సారి చూసి మళ్లీ చూపు మరల్చుకోవడం సాధ్యం కాదు. చిక్కు తీసిన సవరంలా ముద్దుగానూ, చిక్కుపడ్డ వెంట్రుకల్లా పిచ్చిగానూ ఉంటుంది. పున్నమి వెన్నెల్లో ఆరపెట్టుకుంటున్న జుట్టులా మెరిసిపోతూ ఉంటుంది. పన్ను మీద పన్ను ఆమె అందాన్ని కాంతివంతం చేసింది. మనిషిని చూస్తే ఆ పాటున ఆకాశంలో నుంచి వూడిపడ్డట్టు, ఇంక ఎదుగూ బొదుగూ లేకుండా అలా ఉండిపోయినట్టు అనిపిస్తుంది.

సవరం లేకుండా, వొత్తుగా ఏకండీగా పిరుదుల వరకు వేలాడే తలకట్టు ఆమె అందానికి ఆయువు పట్టు.

సవరం కట్టి లేచాను.

"మా ఇంటికి రా అబ్బాయి, సవరం కట్టాలి" అంది అమ్మాజీ.

"ఇక్కడ కట్టించుకోరాదే?" అంది ఓ అమ్మాయి.

"మా అమ్మ కూడా పిలుచుకు రమ్మంది" అని చెప్పింది.

(మిగతా వచ్చే వారం)

